# రూ.32.39.కోట్ల పనులకు ఆమోదం తెలిపిన నార్సింగి కౌన్సిల్



నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, అధికారుల దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
నార్సింగి మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంను చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, కమీషనర్ సురేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు అంతా కలిసి వివిధ అభివృద్ధి పనుల కోస రూ.32.29కోట్లను ఖర్చు చేసేందుకు కౌన్సిల్ సమావేశం తీర్మాణించింది. రూ.14.80.కోట్లను సిసీ రోడ్లకు రూ.2.80కోట్లను భూగర్భ డ్రైనేజి పనులకు, రూ.10.14.కోట్లను కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం, రూ.2.85.కోట్లను స్మశాన వాటికకు, రూ.1.80.కోట్లను మంచినీటి సరఫరా కోసం వెచ్చించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఇ నర్సిహ్మారాజ్, ఎఇ యోగేష్, జల మండలి అధికారులు, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.







**-నేడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న భట్టి**
**-నగరానికి ప్రాధాన్యంపై గ్రేటర్‌వాసుల ఎదురుచూపులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**
అంతర్జాతీయ ఖ్యాతి..పెట్టుబడుల స్వర్గధామంగా చెప్పుకునే మహానగరానికి కేంద్ర బడ్జెట్‌లో నిరాశే మిగిలింది. ఇప్పుడిక రాష్ట్ర బడ్జెట్ వంతు. అభివృద్ధి..మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తుందా? కోటి జనాభా గల గ్రేటర్ హైదరాబాద్‌లో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల పథకాలకు నిధుల వరద పారించేనా? ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయింపు జరిగేనా? మూసీ నదికి నిధుల వరద పారేనా? వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం భవిష్యత్ ఏమిటీ? ఏటా వర్షాలు వచ్చినప్పుడు నీట మునిగే ముంపు ప్రాంతాల కోసం ఉద్దేశించిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమానికి నిధులు దక్కుతాయా? నగర రోడ్లపై నిత్యం ఏరులైపారుతున్న మురుగునీటి నిర్వహణపై ఈ బడ్జెట్ దృష్టి పెడుతుందా..ఇలా పలు అంశాలు నేటి రాష్ట్ర బడ్జెట్ తేలనింది. రాష్ట్ర సర్కారు శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై నగరవాసులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో జరిగే అభివృ ద్ధి ప్రాజెక్టులకు నిధుల వరద పారుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్‌ఎంసి ఇప్పటికే అప్పుల కుప్పగా మారింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులకూ పైసలు లేవు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయిస్తారని మెట్రో వర్గాలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నాయి. అలాగే పోలీస్ విభాగం సైతం బడ్జెట్ కేటాయింపులపై పెద్ద ఆశలే పెట్టుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకునే చర్యలకు నిధుల కేటాయింపు కీలకంగా మారింది.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం (మహాలక్ష్మీ) కోసం రద్దీ అనుగు ణంగా గ్రేటర్ ఆర్టీసిని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. డొక్కు బస్సుల స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టి, ఔటర్‌కు వెలుపల ఉన్న కాలనీలకు ప్రజా రవాణా వసతి కల్పించాల్సిన అవసరముంది. గ్రేటర్‌లో ఆస్పత్రుల అభివృద్ధికి ఈసారి ఎక్కువ కేటాయింపులు ఉంటాయనే భావనతో వైద్యులు, వైద్యాధికారులు ఉన్నారు. నిమ్స్, నిలోఫర్, ఎంఎన్‌జే, ఉస్మానియా, గాంధీ, చెస్ట్, ఫీవర్ ఆస్పత్రుల అభివృద్ధికి బడ్జెట్‌లో మోక్షం ఉంటుందనే ఆశతో ఉన్నారు. ఎంఎం టీఎస్ రెండో దశ విస్తరణకు సంబంధంచి రాష్ట్ర ప్రభుత్వ వాటా దక్కుతుందా అని నగరవాసులు ఎదురుచూస్తున్నారు. ఇవే కాకుండా మిగతా సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని గ్రేటర్ ప్రజలు కోరుతున్నారు.

# మండిపోతున్న ఎండలు



**హైదరాబాద్, ఫిబ్రవరి9 ప్రభాతవార్త**
నగరంలో పగటి ఉష్ణోగ్రతలతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. మార్చి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరి ప్రారంభం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా నగరంలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో 38.5, సరూర్‌నగర్, చందానగర్‌లో 38.4, బేగంపేటలో 37.6, ఉప్పల్‌లో 37.4, శేరిలింగంపల్లిలో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.దీంతో ఏప్రిల్, మే నెలలంటేనే నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## 10న సనత్ నగర్ బిఆర్ఎస్ విజయోత్సవ సభ : ఎమ్మెల్యే తలసాని

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
సనత్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఈ నెల 10న సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలోని ఎస్.వి.ఐ.టీ. ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటిఆర్), మాజీ మంత్రి హరిశ్‌రావ్‌లు పాల్గొంటారని తెలిపారు. వీరితో పాటు నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఆయా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొంటారన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గం కార్యకర్తలు పెద్ద ఎసంఖ్యలో తరలి రావాలన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : కలెక్టర్ అనుదీప్

**-గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు 5 ఎకరాల స్థల సేకరణ**



మహేంద్రహిల్స్ గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలు,గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది ఐఏఎస్, ఐపిఎస్ వంటి స్థానాల్లో సీట్లు సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. మహేంద్రహిల్స్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థినీల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో టీచర్లు విద్యా బోధన ఎలా చేస్తున్నారని, విద్యార్థులకు అందిస్తున్న భోజనాల్లో నాణ్యత ఎలా ఉందని, నాణ్యమైన కూరగాయలు, మాంసహారాలు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్,మంచినీరు, తరగతి గదులు, డార్మెంట్ గదులు ఎలా ఉన్నాయని, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.శిథిలావస్థలో ఉన్న కొన్ని తరగతి గదులను క్వార్టర్స్‌ను పునరుద్దరించాలని ప్రిన్సిపాల్ వినోలా కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

**విద్యార్థినీలతో కలిసి లంచ్ చేసిన కలెక్టర్. . .**
మహేంద్రహిల్స్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న దాదాపు 650 మంది విద్యార్థినీలతో కలిసి లంచ్ చేశారు. రోజు ఈ మాదిరిగానే ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు.

**మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు**
హైదరాబాద్ జిల్లాల్లో సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు 5 ఎకరాల స్థలాన్ని కెటాయించేందుకు చర్యలు తీకుంటున్నామని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. 2024 - 25 వి ద్యా సంవత్సరంలోగురుకుల డిగ్రీ మహిళా కళాశాల సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో కానీ,షేక్‌పేట్‌లో కానీ నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందు వల్ల సువిశాలమైన 5 ఎకరాల స్థలంలో అన్ని హంగుళతో మహిళా డిగ్రీ కళాశాలను నెలకోల్పుటకు స్థలాన్ని సేకరించి తనకు రిపోర్ట్ అందజేయాలని ఆర్‌డిఓ రవికుమార్, మారేడ్‌పల్లి తహశీల్ధార్ పద్మసుందరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అంజయ్య, గురుకుల విద్యా సంస్థల హైదరాబాద్,రంగారెడ్డి రీజినల్ కో-ఆర్టినేటర్ నాగ కళ్యాణి, ప్రిన్సిపాల్ వినోలా, వైస్ ప్రిన్సిపాల్ భారతీ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని పీవీకి భారతరత్నం దక్కడం పట్ల కుటుంబ సభ్యుల సంబురాలు

**-ఎప్పుడో రావాల్సిన భారతరత్న ఇప్పటికైనా రావడం చాలా సంతోషం**
**-పీవీ సోదరుడు మనోహరరావు**



పీవీ నర్సింహారావుకు భారతరత్నం దక్కడం పట్ల ఆయన సోదరుడు మనోహరరావు నివాసంలో సంబురాలు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
భారత పూర్వ ప్రధాన మంత్రి పీవీ.నర్సింహారావుకు ఎట్టకేలకు 'భారతరత్న' ప్రకటించడం పట్ల ఆయన కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. శుక్రవారం గాంధీనగర్‌లోని పీవీ సోదరుడు పీవీ.మనోహరరావు నివాసంలో సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. పీవీ సోదరుడు పీవీ.మనోహరరావు ఒక సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పీవీ కుటుంబ సభ్యులు పీవీ.సరస్వతి, పీవీ.కిరణ్, భార్గవి, లతా, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. పీవీ నర్సింహారావు సోదరుడు పీవీ.మనోహరరావు మాట్లాడుతూ పీవీ గారి గురించి తెలయని వారు లేరని, ప్రధానమంత్రిగా ఆయన దేశంలో ఎన్నో తీసుకువచ్చిన సంస్కరణలు వివిధ రాష్ట్రాల్లో నేటికి అమలవుతున్నాయన్నారు. ఆయన తీసుకువచ్చిన సంస్కరణల వల్ల నేడు దేశం అన్ని రంగాల్లో అత్యున్నతంగా నిలిచిందంటే దానికి కారణం తన సోదరుడు వేసిన బాటలేనని అన్నారు రాజకీయాలకు అతీతంగా తన సోదరుడి పేరును నామినేట్ చేయడం సంతోషం కలిగిందన్నారు. నేడు ప్రపంచ దేశాలతో సమానంగా గర్వించదగ్గ స్థాయికి చేరిందన్నారు. ఎప్పుడో రావాల్సిన భారతరత్న ఇప్పటికైనా రావడం చాలా సంతోషంగా ఉందని, ఆయన ఈ గౌరవం దక్కడం వల్ల ఆయన కుటుంబ సభ్యుల్లోనే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కాకుండా దేశ, విదేశాల్లో పీవీ అభిమానులు సంబురాలు, సంతోషాన్ని పంచుకుంటున్నారన్నారు. పీవీకి లభించిన అత్యుత్తమ గౌరవంగా తాను భావిసఉ్తన్నానని, 1991 నుంచి 1996 వరకు అత్యంత క్లిష్టదశలో దేశ ప్రధానిగా ఆయన బాధ్యతలను చేపట్టారని గుర్తు చేశారు. ప్రధానిగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చాకచక్యంగా పరిష్కరించారన్నారు. ఇది చాలా సంతోషకరమైన వార్త అని అన్నారు. తాను గత 30 సంవత్సరాల నుంచి తాను స్థాపించిన సర్వావర్ధ సంక్షేమ సమితి ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఒక ఉన్నత ఆశయంతో కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు పీవీ గోల్డ్‌మెడల్స్ అందిస్తూ వస్తున్నానని అన్నారు.

# కేసును ఛేదించిన పోలీసులు



వివిరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హరిప్రసాద్.

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**
యూసుఫ్‌గూడ లక్ష్మినరసింహనగర్‌లో ఈనెల 7వ తేదీన పుట్టా రామును దారుణంగా హతమార్చటం జరిగిందని అందుకు సంబంధించిన నిందితుల వివరాలను శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ హరిప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మృతుడు పుట్టా రాముకి ఏ1 నిందితుడు ఇందుగుల మనికంఠ(మణి)కి దాదాపు 7 సంవత్సరాలుగా స్నేహం ఉంది.వీరు మొదట్లో పేకాట, జూల అందర్ బహార్ ఆడిపిస్తూ లక్షలు గడించారు. వీరి మధ్య కొంతకాలంగా లావాదేవీల్లో బేధాభిప్రియాలు ఏర్పడ్డాయి. దీంతో మనికంఠ సొంతంగా ప్యాకాట ఆడిపించటం, సెటిల్‌మెంట్లు చేయటం ప్రారంభించాడు. దీంతో ఒకరిపై ఒకరికి ద్వేషాలు పెరిగిపోయి 2022లో పుట్టా రాము మణికంఠపై దాడి చేయడంతో అతను తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు అయ్యాడు. పుట్టా రాముపై కేసు నమోదైంది. తర్వాత మనికంఠ పుట్టా రామును ఏవిధంగానైనా అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుని గుల్బర్గాలో అందుకు సంబంధించిన ఆయుధాలను సమకూర్చుకున్నాడు. ముందుగా ఏర్పాటు చేసుకున్న ప్లాన్ ప్రకారం యూసుఫ్‌గూడ ఎల్‌ఎన్‌నగర్‌లో వ్యభిచారగృహం నడుపుతున్న ఏ12 పతాన్ నసీమా, హిమాంమ్ హసీనా తల్లికూతుళ్లుకు డబ్బు ఆశచూపించి పుట్టా రామును మట్టుపెట్టేందుకు పన్నాగం పన్నాడు. తల్లీ, కూతుళ్లు ఇద్దరిపై బంజారిహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. మణికి మిత్రుడైన ఏ2 దరావత్ వినోద్‌కుమార్‌కు నసీమకు మొదటి నుంచి సంబంధం ఉండేది. పుట్టా రాము నసీమాతో సంబంధం పెట్టుకోవడంతో వినోద్‌కు కూడా పుట్టా రామును అడ్డు తొలగించు కోవాలని ఎదురుచూస్తుండేవాడు. ఇదే అవకాశంగా తీసుకుని వీరితో పాటు మరో 10 మందితో కలిసి తల్లికూతుళ్లతో పిలిపించి అతి దారుణంగా కత్తులతో దాడి చేసి హత్య చేశారు. వీరిలో ఏ1 నుంచి ఏ6 వరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు సమాచారం మేరకు రామిరెడ్డినగర్, జీడిమెట్లలో జూబ్లీహిల్స్ ఇన్సిపెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకోవటం జరిగింది. నిందితుల నుంచి 5 కత్తులు, ఒక కారు సీజ్ చేయటం జరిగింది. ఇంకా 5 మంది నిందితులు పరారీలో ఉన్నారని వారిని తొంతర్లోనే అరెస్టు చేస్తామని ఏసీపీ పేర్కొన్నారు.

# నేటి నుండి శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి జాతర

**పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**
భక్తులు కోరిన వరిలిచ్చే కొంగు బంగారు తల్లి, సిరులిచ్చే శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి, శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులతో పాటు తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 10వ తేదీ దుయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకము, ఉదయం 8 గంటలకు పుణ్యావచనము, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠ, నవవర్ణజప హోమము, మధ్యాహ్నము 12 గంటలకు కళ్యాణము, తలంబ్రాలు, ఒడిబియ్యాలు, సాయంత్రం 5 గంటలకు సూరారం గ్రామములో గల శ్రీ రామాలయము గుడి వద్ద నుండి అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించబడును. 11వ తేదీన ఉదయం 5 గంటలకు అలంకరణములు, శ్రీ చక్రార్చన, కుంకుమార్చనలు, ఒడిబియ్యాలు, మంగళహారతి, బోనాలు, మొక్కుబడులు, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. 12వ తేదీన రంగం, భవిష్యవాణి, భూతబలి, వేదమంత్రాలతో ఆశీర్వచనము, సాయంత్రం 5 గంటలకు సూరారం గ్రామము నుండి పోతురాజుల విన్యాసాలతో పలారంబండి ఊరేగింపు జరుగుతుందని, 4వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించన్నుట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## సమాజసేవతోనే జన్మకు సార్థకత : డా. కె.వి.రమణాచారి



తులసివనం మహోత్సవ గోపూజలో పాల్గొన్న విద్యార్థులు

**నాంపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
ప్రతీఒక్కరూ తమ శక్తికొద్దీ తోటివారికి సామాజిక బాధ్యతగా ప్రజలకు ఉపయుక్తమైన మంచిపనులు చేస్తూ సమాజానికి తగిన సేవచేస్తేను జన్మకు సార్థకత ఏర్పడుతుందని ప్రముఖ విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. భారత వికాస్ పరిషత్, తెలంగాణ ఆధ్వర్యంలో ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని చౌటుప్పల్‌లో శ్రీరమణ తులసివనం పేరిట విద్యార్థులచే తులసి మొక్కలు నాటించి వాటి సంరక్షణకు ఏర్పాటు చేయడం, కుత్బుల్లాపూర్‌లో శివా విద్యానికేతన్ విద్యార్థులచే గోపూజ కార్యక్రమాలను అంతర్జాలంలోని జూమ్ ద్వారా రమణాచారి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న నరేంద్రకృష్ణను అభినందిస్తూ ఆయనకు తోడ్పడుతున్న నాగరాజ్, గౌరీశంకర్, సాధన నరసింహాచార్య, సదాశివరెడ్డిలను సత్కరించారు.

# సీపీఆర్ ద్వారా గుండెపోటుకు గురైన వారిని రక్షించవచ్చు



సీపీఆర్ ప్రక్రియను శిక్షణ ఇస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్తః**
గుండెపోటుకు గురైన వ్యక్తులు దాదాపుగా 90 శాతానికి పైగా మృతి చెందుతున్నారని, అలాంటి వారిని కాపాడేందుకు కృషి చేయల్సిన అవసరం ఉదని గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. శుక్రవారం గాంధీ మెడికల్ కళశాల అలుమ్ని అసోసియేషన్, గ్లోబల్ అలియన్స్(ఓవర్సీస్ ఓల్డ్ స్టూడెంట్స్ ఆఫ్ జీఎంసీ) సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో సీపీఆర్ (కమ్యూనిటీ హాండ్స్ ఆన్ కార్డియో పల్మనరీ రిసక్టెషన్), బీఎల్ఎస్ ( బేసిక్ లైఫ్ సపోర్ట్ అంశాలపై ఉచిత శిక్షణ, అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశా వ్యాప్తంగా దాదాపు నాలుగున్న శాతం మంది ఉన్నపలంగా కార్డియాక్ అరెస్ట్ కారణంగా మృతి చెందుతున్నారని తెలిపారు. వీరిని ఆస్పత్రికి తరలించే లోపే అత్యధిక శాతం మరణిస్తున్నారని చెప్పారు. వీరిరి కాపాలంటే ప్రతి ఒక్కరికి సీపీఆర్ పట్ల అవగాహన అవసరమని అన్నారు. రోగిని ఆస్పత్రికి తరలించే లోపు అందుబాటులో ఉన్న ప్రజలు రోగికి సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. గాంధీ అలుమ్ని ప్రెసిడెంట్ డాక్టర్ జిఆర్ లింగమూర్తి, సెక్రటరీ డాక్టర్ రత్నం మాట్లాడుతూ హఠాత్తుగా కుప్పకూలడం, అపస్మారక స్థితిలోకి వెళ్లి ఊపిరి అందకపోవడం, నాడీ కొట్టుకోవడం, ఛాతీలో నొప్పి లాంటివి గుండెపోటు లక్షణాలని, అలాంటి వారికి సడేన్‌గా కార్డియాక్ అరెస్ట్ అయితే అంబులెన్స్ వచ్చి ఆప్పత్రికి తరలించేలోపు మృతి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. వీరికి సీపీఆర్ ప్రక్రియ ద్వారా బ్రతికించవచ్చని పేర్కొన్నారు. ఛాతీ మధ్యలో బలంగా, వేగంగా నిమిషానికి దాదాపు వంద నుంచి వంద ఇరవైసార్లు మర్ధన చేయాలన్నారు. ఇప్పటికే వేలాధి మందికి శిక్షణ ఇచ్చారని, వారందరు తగిన సమయంలో సహాయసహకారాలు అందిస్తున్నారని తెలిపారు. సీపీఆర్ ద్వారా ప్రాణం పోసిన వారిని తగిన విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యాక్రమంలో వైద్య విద్యార్థులు ఇతర విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో కార్మికుడి అరెస్టు



దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

**చార్మినార్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
దుకాణం యజమానిని మోసం చేసి షాపులో ఉన్న నగదును దొంగతనం చేసిన కేసులో మీర్‌చౌక్ పోలీసులు శుక్రవారం నింధితుడిని అదుపులోకీ తీసుకున్నారు.షాపులో పని చేసే పున్ పున్ ధోలే కార్మికుడు వద్ద నుంచి 14 లక్షల 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను దక్షిణ మండలం అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.మలక్‌పేట్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ హుస్సేన్ పాతబస్తీ నూర్‌ఖాన్‌బజార్‌లో జమ్‌జమ్ పాస్టనర్స్ పేరుతో ట్రాక్టర్ల విడి భాగాలు విక్రయించే షాపును నిర్వహిస్తున్నాడు.కాగా జహీరాబాద్ జిల్లా సిరాగ్‌పల్లికి చెందిన పున్‌పున్ ధోళే (23) జమ్‌జమ్ పాస్టనర్స్ షాపులో గతఆరు నెలలు నుంచి దిన సరి కార్మికుడిగా పని చేస్తున్నాడు.అదే షాపులో పెంట్‌హౌస్‌లో ధోళే నివాసం ఉంటున్నాడు.షాపు యజయాని ఈ నెల 6వ తేదీ రాత్రి షాపుకు తాళాలువేసి ఇంటికి వెళ్లాడు.మరుసటి రోజు 7వ తేదీ ఉదయం యజమాని షాపు తెరవటానికి వచ్చాడు.దుకాణంలోని క్యాష్ కౌంటర్‌లో ఉంచిని డబ్బులు కనిపించ లేదు.దొంగతనం జరిగిందని భావించిన యజమాని మహ్మద్ అహ్మద్ హుస్సేన్ ఈ విషయమై మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.శుక్రవారం పోలీసులు పున్‌పున్ ధోళేను అదుపులోకీ తీసు కుని అతని వద్ద నుంచి 14 లక్షల 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.విలేకర్ల సమావేశంలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్,అడిషనల్ ఇన్‌స్పెక్టర దిలీప్ కుమార్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేడ్కర్ రాజ్యాంగం ఎన్నోదేశాలకు ఆదర్శం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రేవంత్‌రెడ్డి, బిఎస్‌రాములు, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్‌రావు తదితరులు

**-"బిసినోట్ " పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
భారతదేశంలో అంబేడ్కర్ ఓఅద్భుతమని ,ఆయన దేశానికి అందిచిన రాజ్యాంగం ఎన్నోదేశాలకు ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలోని తనఛాంబర్‌లో బిసి కమిషన్ తొలిచైర్మన్ బిఎస్‌రాములు భారత రాజ్యాంగం, ఓబిసిలకు అంబేడ్కర్ కాంట్రిబ్యూషన్ ప్రస్తావన పేరుతో రాసిన "బిసినోట్ "పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈసందర్బంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిసామాజిక వర్గానికి,కులానికి ప్రాతినిథ్యం, అవకాశం జనాభా దామాషా మేరకు ప్రతిపాదించి అమలు జరిపితే అన్ని ప్రాంతాలకు అన్నివర్గాలకు సమానమైన అవకాశాలు అందుతాయన్నారు. తద్వారా ఆయా సామాజికవర్గాల్లో ప్రాతినిథ్యం పెరిగి ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం వస్తుందన్నారు. ఈసందర్బంగా కులగణనపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సిఎం రేవంత్‌రెడ్డికి ఓబిసి సమాఖ్య కృతజ్ఞతలు తెలిపింది. దేశవ్యాప్తంగా ఓబిసి రిజర్వేషన్ల అమలుకై భారతీయ ఓబిసి సమాఖ్య చేస్తున్న ఉద్యమానికి మద్దతు కావాలని సంఘం జాతీయ అధ్యక్షులు కె.కోటేశ్వర్‌రావు, పుస్తకరచయిత సమాఖ్య గౌరవాధ్యక్షులు బిఎస్‌రాములు కోరారు. ఈకార్యక్రమంలో సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనంచిన్ని వెంకటేశ్వర్‌రావు, సభ్యులఉ చింతకాయల వెంకటేశ్వర్లు, శీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కవితకు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేసే నైతిక హక్కు లేదు

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసమే అసెంబ్లీలో మహాత్మాజ్యోతిరావ్ పూలేవి గ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు, ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తామని ప్రకటించడం సిగ్గు చేటని పలు తెలంగాణ ఉద్యమ సంఘాలు నిశితంగా విమర్శించాయి. ధర్నా చౌక్‌లో ధర్నాలను నిషేదించిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి 12వ తేదీన ధర్నా చేస్తామని కవిత ప్రకటించడం అవకాశవాది రాజకీయాలకు పరాకాష్ట అని సంఘాల నాయకులు విమర్శించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్, ఉద్యమ కారుల జాక్ కన్వీనర్ రామగిరి ప్రకాశ్ తదితరులు మాట్లాడుతూ కవిత ధర్నా చేయడానికి అనుమతి ఇవ్వరాదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు అనుమతి ఇస్తే ఉద్యమకారులంతా ఐక్యంగా అడ్డుకుంటామని, ఆపైన జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుందని వారు హెచ్చరించారు. తొమ్మిదిన్నర సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకున్న కల్వకుంట్ల కుటుంబానికి పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఎదుట పెట్టాలన్న ఆలోచన ఎందుకు గుర్తుకు రాలేదని వారు ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం టి-జెఏసి ఛైర్మన్‌గా ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామని ప్రకటిస్తే అర్ధరాత్రి ఆయన ఇంటిని ముట్టిడించి తలుపులు పగలగొట్టి అరెస్టు చేశారని ఆరోపించారు.కవిత ధర్నా చేయాలనుకుంటే ముందుగా గన్‌పార్కులోని అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి ముక్కును నెలకు రాసి ధర్నా చేయాలని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో దోమ్మట వెంకటేష్, సుధాకర్, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్ దేశాయి చిత్రంలో చీమా శ్రీనివాస్ తదితరులు

# కార్పొరేట్ శక్తులు విద్యుత్ సంస్థల్లోకి వస్తే రైతులకు తీవ్ర నష్టం

**-"సేవ్ పవర్ సెక్టార్ -సేవ్ ఇండియా "నినాదంతో దేశవ్యాప్త ఆందోళనలు**
**-ఏఐఎస్ఈ ప్రధాన కార్యదర్శి మోహన్ శర్మ**

**హైదరాబాద్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:**
విద్యుత్ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా కేంద్రం ప్రయత్నిస్తుందని వాటిని కార్మిక లోకమంతా ఐక్యంగా అడ్డుకోవాల్సి న అవసరం ఉందని ఆల్‌ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (ఏఐఎస్ఈ) ప్రధాన కార్యదర్శి మోహన్ శర్మ అన్నారు. కార్పొరేట్ కంపెనీలు విద్యుత్ సంస్థల్లో అడుగుపెడితే సామాన్య ప్రజలతోపాటు రైతులపై తీవ్ర ఆర్థికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్రధాన కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ "సేవ్ పవర్ సెక్టార్-సేవ్ ఇండియా "నినాదంతో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థలను రక్షిం చుకోవాల్సి న బాధ్యత ఉద్యోగులతోపాటు ప్రజలపై ఉందన్నారు 15లక్షల మంది ఉద్యోగులు ,విద్యుత్‌రంగంలో ప్రత్యక్షంగా పరోక్షంగా పనిచేస్తున్నాని సమానపనికి సమానవేతనం కార్మికులకు చెల్లించాలని సుప్రీంకోర్టు సూచించినా వాటిని నేటికి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా కేంద్రం నిర్ణయాలు తీసుకోవద్దని, కార్పొరేట్ కంపెనీలు విద్యుత్ సంస్థల్లోకి వస్తే విద్యుత్ యూనిట్ ధరలు భారీగా పెరిగి సామాన్యులకు కరెంట్ దూరమవుతుందన్నారు. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల యూనియన్లతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.



సమావవేశంలో మాట్లాడుతున్న మోహన్‌శర్మ, సాయిబాబు తదితరులు

**నేడు,రేపు ఏఐఎస్ఈ జాతీయ సమావేశం ..**
ఐఎస్ఈఈ 16వ జాతీయ సమావేశాన్ని శని,ఆదివారాల్లో రెండురోజులపాటు ఎర్రగడ్డ జిటిఎస్ కాలనీలోని జెన్కో ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయూస్ 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబ తెలిపారు. దీనికి దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల నుంచి సుమారు 300లమంది ప్రతినిధులు హాజరవుతారని 10వేలమంది కార్మికులతో స్వాగత ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక సలహాదారు మల్లురవి, జమ్మూ -కాశ్మీర్, నేపాల్‌ల నుంచి పలువురు ముఖ్యనేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఏఐఎస్ఈఈ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహ్మద్ షమీముల్లా, సెక్రటరీ కృష్ణ బోయర్, 1104 రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హృదయాలలో స్థానం సంపాదించిన వ్యక్తి రమణాచారి



గాయనీ సంయుక్త బృందం సభ్యులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ప్రముఖ సంగీత గురువు, గానసభ సంగీత కళాశాల అధ్యాపకురాలు సంయుక్త తమ శిష్యబృందంతో కలిసి అన్నమయ్య, రామదాసు కీర్తనలు శ్రావ్యంగా గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి 72వ జన్మదినోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా సంకీర్తనల గాన కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త బృంద గానగోష్ఠి ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా నేటినిజం పత్రిక ఎడిటర్ బైసా దేవదాస్ హాజరై ప్రసంగిస్తూ సంగీతం మనసుకి విశ్రాంతి ఇస్తుందన్నారు. ధనం సంపాదించిన ఎందరో అధికారులు చాలా మంది ఉన్నారని, ప్రజల హృదయాలలో స్థానం సంపాదించిన వారిలో కెవి.రమణాచారి ప్రముఖులు అని అన్నారు. దేశంలో ఎక్కడా ఒక అధికారి పదవి విరమణ చేసిన తర్వాత కూడా రోజుల తరబడి ఆయన జన్మదినోత్సవాలను వేడుకగా జరగడం వినలేదని, అది ఒక్క రమణాచారి విషయంలో మాత్రమేనని అన్నారు. ఆయన సహృదయత, ప్రేమతత్వం ఇందుకు కారణం అని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ రమణాచారి పట్ల ఉన్న అభిమానంతో కళాసప్తాహం జరిపామని, ఇందుకు సహకరించిన వారితో పాటు దినపత్రికల వారికి ధన్యవాదాలు తెలిపారు

## 14న వీర జవాన్ల దినోత్సవంగా జరుపుకోవాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఈ నెల 14న వాలెంటైన్స్ డే (ప్రేమికుల దినోత్సవాన్ని) బహిష్కరించి వీర జవాన్ల దినోత్సవంగా జరుపుకోవాలని, విహెచ్‌పి, బజరంగ్ దళ్ పిలుపునిచ్చాయి. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు పండరీనాథ్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు వాలెంటైన్స్ డేను నిరసిస్తూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విదేశీ విష సంస్కృతిని విడనాడిభారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. ప్రేమ పేరుతో అశ్లీలతను పెంపొందించే విష సంస్కృతిని యువతపై రుద్దుతున్న కార్పొరేట్ శక్తుల కుట్రలకు బలికావద్దని సూచించారు. 14 వ తేదీన పుల్వామాలో జరగిన ఘటన ఆధారంగా ఆరోజు వీరమరణం పొందిన ఆత్మకు శాంతి చేకూరాలనే లక్ష్యంతో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఆ రోజున పార్కుల్లో, హోటల్స్, పబ్‌లు, విహార స్థలాల్లో సంచరించవద్దని వారు కల్తి ప్రేమికులను కోరారు. సంచరిస్తే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

## భారతీయసంస్కృతి, సంప్రదాయాలలో హరికథకు సముచిత స్థానం

**-ఏపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిసన్ పూర్వ సభ్యుడు,**
**విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ పి.రఘు**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
భారతీయసంస్కృతి, సంప్రదాయాలలో హరికథకు సముచిత స్థానం ఉందని ఎపి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిసన్ పూర్వ సభ్యుడు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ పి.రఘు అన్నారు. నల్లకుంటలోని శృంగేరి శంకర మఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి 72వ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని హరికథా మహోత్సవాల సందర్బంగా నల్లగొండకు చెందిన జల్దా విశ్వనాథ జయరాములు భాగవతార్‌చే 'శ్రీనివాస కళ్యాణం' హరికథాగాన కార్యక్రమం జరిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పి.రఘు మాట్లాడుతూ హరికథ పితామహుడు ఆధిభట్ల నారాయణదాసు వంటి మహనీయులు ఈ కళారూపానికి జీవం పోశారన్నారు. డాక్టర కె.వి.రమణాచారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న హరికథ కళాకారులను ఆదుకుంటూ వారికి ఉపాదికి, ప్రదర్శనలు ఇప్పించడానికి ఎంతో కృషి చేశారన్నారు. భారతీయ సంస్కృతిని, భాషను పరిరక్షించుకోవాల్సి న అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్,శంకరమఠం శాఖాధిపతి కె.కృష్ణారావు, నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. హరికథా గానానికి తబలపై సుధాకర్, వయోలిన్‌పై శశిభూషణ్ వాద్యసహకారాన్ని అందించారు.

## భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**
కాటేదన్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ అభివృద్ధి పనులను శు క్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి,వాటర్ వర్క్స్ సీవరేజ్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మర్రి మహేందర్ రెడ్డి,బుచ్చిరెడ్డి,రాము,జనార్దన్,ఓం సింగ్,గోవర్ధన్ రెడ్డి,పాండు,కృష్ణ రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

## టీవీన్యూస్ ప్రెజెంటర్స్-2023 పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రసార మాధ్యమాల్లో విధులు నిర్వహిస్తున్న టీవీన్యూస్ ప్రెజెంటర్స్-2023కుగాను పురస్కారాలను ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత లోకం కృష్ణయ్య వివరించారు. 10న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జీవిత సాఫల్య పురస్కారాలను పిళ్ళా నిర్మల(ఫ్రీలాన్స్), జి.రమణబాబు తదితరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యే విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు చేతులమీదుగా అందుకుంటారని,గంగోత్రి గోసంరక్షణ సమితి చైర్మన్ జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఆర్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి, సభను యువకళావాహిని సంస్థ అధినేత లంక లక్ష్మినారాయణ, హెలెన్ కిల్లర్స్ ఇన్స్టిట్యూట్ రీసర్చ్ చైర్మన్ పి.ఉమర్ ఖాన్, ఇనుగాల యుగేంధర్‌రెడ్డి, కళాభిమాని శైలజ, పారిశ్రామికవేత్త కె.విజయలక్ష్మి, కళాపోషకులు వీరభోగ వసంతరాయలు, బిజెపి నాయకులు బీరం ఇందిరారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు వినోద్‌బాబు, శ్రీ, లలితారావు, విజయలక్ష్మి శెట్టి, టివి.రావు, సంపత్‌కుమార్, డి.స్వర్ణలత తదితరులు గానం చేస్తారని, కరవాకే సహకారాన్ని సుదర్శన్ అందిస్తారు.

### కులగణనపై సుప్రీంకోర్టులో వాదనలు రెండు వారాల పాటు వాయిదా

**-జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కులగణనపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయని జాతీయ ఓబీసీ హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ వివరించారు.ప్రఖ్యాత న్యాయకోవిదుతు కెఎస్.చౌహాన్, ఆర్.కృష్ణయ్య, కరుణానిధి తరపున ప్రముఖ న్యాయవాదులు ఎంఎన్.రావు, ఎండి ఎన్.రావు, మహేష్ చారలు హాజరయ్యారు. 2020 నుంచి న్యాయస్థానంలో వాదనలు జరుగుతున్నాయి. పిటీషనర్ల తరపున న్యాయవాదుల తీర్పుకోసం ఒత్తిడి చేసిన సందర్భంలో కేంద్రం తరపున ముగ్గురు అదనపు సొలిసిటర్ జనరల్, పలువురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. కాగా మూడు సంవత్సరాల కింద ఆళ్ళ రామకృష్ణ వేసిన పిటిషన్‌పై కౌంటర్ వేయడానికి రెండు వారాల సమయం అడిగారని, దీనిపై తదుపరి వాయిదాలో పూర్తి సమాచారం ఇవ్వాలని, మరింత సమయం ఇక ఇవ్వడం కుదరని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగిందని వివరించారు.

## పీవీ గారికి భారత రత్న ప్రకటించటం హర్షనీయం

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావుగారికి భారతరత్న పురస్కారం ప్రకటించటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నతమైన భారతరత్న అవార్డును ప్రకటించిన సందర్భంగా పీవీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పతనావస్థలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థను తన విప్లవాత్మక నిర్ణయాలతో పునరుద్ధరించిన అపరమేధావి పీవీ నరసింహారావు అని కొనియాడారు. మన తెలంగాణ మహనీయునికి భారత రత్న రావటం యావత్ తెలంగాణ సమాజానికి గర్వకారణమని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా ప్రధాన మంత్రిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

### పి.వి.కి భారతరత్న ప్రకటించడం గర్వించదగ్గ విషయం

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని పి.వి.నరసిం హారావుకు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' అవార్డు ప్రకటించడం పట్ల పి.వి.నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్య దర్శి మాధంశెట్టి అనిల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరే ంద్రమోదీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణకు చెందిన పివి నరసింహారావుకు తొలిసారిగా భారతరత్న అవార్డు ప్రకటించడం తెలుగు ప్రజలకు గర్వకారణ మన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ప్రధాని మంత్రి స్థాయికి ఎదిగిన పివి గొప్ప రాజనీతజ్ఞడని, బహుభాషాకోవిధుడని, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని, భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ దేశాలలో ఇనుమడింపజేశారని ఆయన గుర్తు చేశారు. పివి సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం గర్వించదగ్గ విషయమన్నారు.

### అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్,జక్కుల మహేశ్వర్ రెడ్డిలు తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని శు క్రవారం ప్రముఖ వ్యాపార వేత్త ప్రకాశ్ భటియా సహకారంతో కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన నల్లపోచమ్మ అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ ససంఘం ప్రతినిధులు అనీల్ గౌడ్, టింకూగౌడ్, శశి,రవి, అజిత్, దుర్గయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ ఆస్థులు కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత శ్రీగణేష్



లాల్ బజార్ మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న బిజెపి నేత శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ఆలయ నూతన కమిటీ ప్రతినిధులు,ధర్మకర్తలు దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని కంటోన్మెంట్ నియోజకవర్గం బిజెపి ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం 7వ వార్డు లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయ నూతన కార్యవర్గ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఆలయ స్థలం అక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆస్తులు కాపాడడం కమిటీ, భక్తుల కనీస ధర్మమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌సీఆర్ మజ్దూర్ యూనియన్‌లో చేరిన సీసీ.ఎస్.డైరెక్టర్

**కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
దక్షిణ మధ్య రైల్వేలోని సీసీ.ఎస్.ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి డైరెక్టర్‌గా విజయం సాధించిన మహేశ్ శుక్రవారం మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.శంకర్ రావ్,అధ్యక్షులు కె.శ్రీనివాస్‌ల సమక్షంలో మజ్దూర్ యూనియన్‌లో చేరారు. మహేశ్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి మజ్దూర్ యూనియన్‌లో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నేతలు మురళీధర్, ఉదయ భాస్కర్, వరప్రసాద్, కృష్ణ,ఖాజా బాబు, స్వామి, నరి సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ మందిరాన్ని ప్రతి ఒక్కరూ దర్శించి తరించాలి



అయోధ్యకు వెళ్ళే భక్తులతో రాజేశ్వరరావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**
అదిపురుషుడైన శ్రీరాముడు కొలువు తీరి ఉన్న అయోధ్య భవ్య శ్రీరామ మందిరాన్ని ప్రతి ఒక్కరూ దర్శించి తరించాలని బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి అయోధ్యకు వెళ్ళే భక్తులను శుక్రవారం వద్దేపల్లి రాజేశ్వరారవు కలిశారు. నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ బిజెపి నాయకులు, రామ భక్తులు ఉప్పల చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో అయోధ్యరామ్‌లల్లా దర్శనం కొరకు బయలుదేరుతున్న సందర్బంగా వద్దేపల్లి రాజేశ్వరారవు ఘన స్వాగతంతో సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అయోధ్యలోని భవ్య శ్రీరామ మందిర నిర్మాణం కల జనవరి 22న నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అయోధ్యలోని రామ్‌లల్లా దర్శనానికి ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేశారని అన్నారు.కార్యక్రమంలో డివి జన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, సీనియర్ నాయకుల దాకయ్య, బీజేపై ఎం అసెంబ్లీ కన్వీనర్ ఇ.సాయి, బిజెపి నాయకులు, రామ భక్తులు పాల్గొన్నారు.

## మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి

**-మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న రంగారావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**
పటేల్ కుంట పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పించి మరింత అభివృద్ధి చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తామని వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పేర్కొన్నారు. ఈనాడు కాలనీలో గల పటేల్ కుంట పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శుక్రవారం మాధవరం రంగారావు సందర్శించి పార్కు కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్‌లో ఉన్నటువంటి పరికరాలు సరిపోవడం లేదని మరింత విస్తరించి అందరికీ ఉపయోగపడే విధంగా పార్కును అభివృద్ధి పరచాలని కోరారు. పార్కు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని రంగారావు దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్ళి పటేల్ కుంట పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు భీమయ్య, వెంకటరెడ్డి, రాములు, కృష్ణ, శేఖర్‌యాదవ్, గిరిబాబు, సురేష్‌ముదిరాజ్, కృష్ణమూర్తి, చందు, ప్రకాష్, దుర్గా పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**
భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అస్‌బెస్టాస్ కాలనీలోని శ్రీ భవాని శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులకు శుక్రవారం గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఐడెంటిటీ కార్డుల పంపిణీ చేశారు. ప్రగతినగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాప అధ్యక్షులు వీరన్నగుప్ప, అధ్యక్షులు బాలాజీ, ఉపాధ్యక్షులు మోహనరావు, నర్సింహా, ప్రధాన కార్యదర్శి కాశిం, శ్రీను, ఆగంరెడ్డి, ఆరోగ్యం, కమిటీ సభ్యులు శ్రీను, రవి, చంద్రయ్య, తిరుపతిరావు, హరిబాబు, కృష్ణారావు, ఆంజనేయులు, రాంబాబు, శివకుమార్, నర్సింహా, గణేష్, దుర్యోదన, సంజీవరావు, కాంగ్రెస్ నాయకులు శివ,కన్నారావు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

### బిజెపి నాయకులకు వీడ్కోలు పలికిన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు



సికింద్రాబాద్ స్టేషన్ వద్ద అయోధ్యకు వెళ్లుతున్న మల్కాజిగిరి బిజేపీ నాయకులకు వీడ్కోలు పలుకుతున్న రాంచందర్‌రావు తధితరులు

**మెట్టుగూడ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
అయోధ్య రామందిరానికి వెళ్లుతున్న మల్కాజిగిరి బిజేపీ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బిజేపీ శ్రేణులతో కలిసి వీడ్కోలు పలికి వారిని అభినందించారు.అయోధ్యకు వెళ్లుతున్న వారితో ఆయన మాట్లాడి రైలును జెండా ఊపి వీడ్కోలు పలికారు. ప్రతి ఒక్కరు బాలరాముడిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మల్లాపూర్‌లో బాటసారులకు అన్నదాన కార్యక్రమం

**నాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నాచారం, మల్లాపూర్ అగర్వాల్ సమాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మల్లాపూర్ ప్రధాన రోడ్డులో బాటసారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మందికి ప్రతి నెల మాదిరిగానే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాచారం, మల్లాపూర్ అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు ప్రదీప్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి ప్రతిక్‌నాసరియా, ఉపాధ్యక్షులు సునిల్ అగర్వాల్ పేర్కొన్నారు. అన్నిదానాల్లో కెల్ల అన్నదానం మిన్న అనే నినాదంతో తాము ప్రతి నెల తమ అగర్వాల్ సమాజ్ శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎంతో సంతోషంగా నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో ఎంతో సంతోషం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కొవిందరామ్ అగర్వాల్, కోషాదికారి సత్యనారాయణ, కన్వీనర్లు సురేష్ జిత్‌పురియా,ప్రవీన్ జాగ్నెవాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**మాజీ ప్రధాని పీవీకి భారతరత్నతో గౌరవించడం సంతోషంగా ఉంది**
**- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు**

**తార్నాక, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని పీవీ నర్సింహ్మారావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తార్నాకలోని ఆయన నివసంలో మాట్లాడుతూ పీవీకి భారతరత్న ఇచ్చిన సందర్బంగా ప్రధాని నరేంద్రమోది, రాష్ట్ర బిజేపీ అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలన్నారు. ఈ పురస్కారంతో పీవీకి సరైన గౌరవం దక్కిందన్నారు. విశిష్ట పండితుడు, రాజనీతజ్ఞుడిగా పీవీ దేశానికి వివిధ హోదాల్లో విస్తృతంగా సేవందించారని గుర్తు చేశారు. అప్పుల భారతాన్ని అభివృద్ధి వైపు నడిపిన పీవీ గొప్పనాయకుడన్నారు. బీజేపీ పీవీకి తగిన గుర్తింపు నివ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శిగా వరుణ్ రాహుల్



వరుణ్‌రాహుల్‌కునియామకపత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర యాక్టింగ్ ఆర్గనైజర్ ఎం.జితేందర్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఆలిండియా కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శిగా చిక్కడపల్లికి చెందిన కెప్టెన్ ఆకెళ్ళ వరుణ్‌రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ జాతీయచీఫ్ ఆర్గనైజర్ లాల్ జి దేశాయ్ పేరుతో జారీ చేసిన నియామకపత్రాన్ని తెలంగాణ రాష్ట్ర యాక్టింగ్ ఆర్గనైజర్ ఎం.జితేందర్ చేతులమీదుగా శుక్రవారం వరుణ్‌రాహుల్ అందుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్‌రాహుల్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలలో పార్టీవిజయానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసకెళ్లి విస్తృతంగా ప్రచారం కావడానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వరుణ్‌రాహుల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు రత్నం లింగాల,షేక్ నాగుల్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ వినాశకరమైన కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తూ ఈ నెల 16న దేశ వ్యాప్త భారీ సమ్మె నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. 16న జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రాష్ట్రంలోని అని న జిల్లాల రవాణా రంగ కార్మికులను ఆయన కోరారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమై 16న అంగన్‌వాడీ సెంటర్ల ను మూసివేసి సమ్మెలో పాల్గొనాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాయీశ్వరీ, నందూరి కరుణకుమారి, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి డా.బి.వి.విజయలక్ష్మి పిలుపునిచ్చారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బి.వెంకటేశం

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : మీర్‌పేట్ మహిళా కార్పొరేటర్లు


కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు విజయలక్ష్మి, సౌందర్యలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలు, అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న సెల్లార్లపై చర్యలు తీసుకొని నిలిపి వేయాలని 31,35వ డివిజన్లకు చెందిన మహిళా కార్పొరేటర్లు పాలమూరి విజయలక్ష్మి రాజు, జిల్లా సౌందర్య విజయ్‌లు కార్పొరేషన్ కమీషనర్ ఎ.వాణిరెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కమీషనర్‌ను కలిసి వాటిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు కమీషనర్‌తో మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ సర్వే నెంబర్ 119 ప్రభుత్వ భూమిలోని మెయిన్‌రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం 150 ఫీట్లు ఉందనీ అయితే రోడ్డు పక్కన ప్రైవేటు వ్యక్తులు సెట్ బ్యాక్ కాకుండానే అక్రమంగా సెల్లార్ నిర్మాణం కోసం తవ్వుతున్నారని తెలిపారు. దీంతో పక్కన ఉన్న గృహాలకు సెల్లార్ తవ్వకాలవల్ల ప్రమాదం పొంచిఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా మంద మల్లమ్మ వెళ్లే ఆర్‌సిఐ రోడ్డు మిథిలానగర్ చౌరస్తా సమీపంలో రెండు అనుమతి లేని భవన నిర్మాణాలు, జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం చౌరస్తా నుండి గాయత్రీనగర్ వైపు వెళ్లే రోడ్డులో అక్రమ సెల్లార్ నిర్మాణాలు జరుగుతున్నాయని కమీషనర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో అక్రమసెల్లార్లను పూడ్చివేయించి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను ఆపి బాధ్యులపై చర్యలు తీసుకొని జరిమానాలు విధించాలని వారు కోరారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి


జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

**తార్నాక, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో డిప్యూటీ మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిటీనీ ప్రణాళిక బద్ధంగా నిర్మించడంలో టౌన్‌ప్లానింగ్‌లో అధికారులందరు పనిచేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కల్గించే అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రజిత, సైట్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్, చైన్‌మెన్ ఆంజనేయులు తధితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నవరసింహ రావుకు భారతరత్న అత్యున్నత పురస్కారం

**వనస్థలిపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని స్వర్గీయ పివి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అత్యున్నత పురస్కారం ప్రకటించింది. ఆలస్యమైనా భారతరత్న పురస్కారం బహుభాషా కోవిదుడు, భూ, ఆర్థిక సంస్కరణలతోపాటు వివిధ రంగాల్లో దేశాన్ని ఉన్నత స్థాయికి చేర్చిన పివి కి భారతరత్న ఇవ్వడంవల్ల పురస్కారానికే వన్నె వచ్చిందని, యావత్ బ్రాహ్మణ జాతికి గర్వ కారణమని రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చింతపల్లి మంగపతిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మీనారాయణలు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి పివి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు చెప్పారు.

## ఓల్డ్ గాయత్రీనగర్‌లో మెగా హెల్త్ క్యాంప్


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని జిల్లెలగూడ ఓల్డ్ గాయత్రీనగర్‌లోనున్న శ్రీ శారదా లక్ష్మీ నరి ్సంహ స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం స్థానిక డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, జిల్లెలగూడ గీతాంజలి లయన్స్ క్లబ్ సభ్యుడు వంటేరు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఓజోన్ ఆసుపత్రి, నేత్రాలయ హాస్పిటల్, గీతాంజలి లయన్స్‌క్లబ్‌ల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె, ఎముకలు, బిపి, మధుమేహం, కంటి, గైనిక్, దంత తదితర వైద్యపరీక్షలను నిర్వహించారు. సుమారు ఐదు వందల మంది ఈ శిబిరాన్ని ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్ వెంకట్‌రెడ్డి, ఎంవి చారి, మల్లారెడ్డి, వెంకటేష్, లోకరెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణ, రఘు, వెంకట్, చల్లా బాల్‌రెడ్డి, లంకాల రమేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జ్ఞానేశ్వరచారి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తాం : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అందుబాటులో ఉన్న నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చుచేస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని మిధానికాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో సీసీరోడ్లు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. కాలనీలోని పార్కులో పిచ్చిమొక్కలు, చెత్తచెదారంలో నిండిపోయిందని, అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. సమస్యలపై కార్పొరేటర్ స్పందిస్తూ అధికారులతో సమీక్షించి వీలయినంత త్వరలో సీసీరోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్కును శుభ్రపరచాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు అంజయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రాంరెడ్డి, సోమేశ్వర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లకు మద్దతుగా ఆటోలో వెళ్లిన అసెంబ్లీకి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


అసెంబ్లీకి ఆటోలో వెళుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌నుంచి ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. ఆటోడ్రైవర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవలంభిస్తున్న వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి ఆటోల్లో చేరుకున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు సంఘీభావం తెలిపారు.

## లార్డ్స్ పాఠశాలలో క్రీడోపై అవగాహన

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని లార్డ్స్ పాఠశాలలో క్రీడో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర ్భంగా లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ మారుతున్న పెరుగుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యారు ్థల్లో అభ్యసనావృద్ధిని పెంచి వారిని తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో క్రీడోపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల భవిషత్తుల్లో ప్రావీణ్యంగల పౌరులుగా విదా ్యర్థులు తయారయ్యే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్లు రామిడి సంతోష్, బానూరు శ్రీనివాస్‌రెడ్డి, ఇంఛార్జి రేఖా సాగర్, క్రీడో ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా హబ్సిగూడలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు గణేష్‌నాయక్ ఆధ్వర్యంలో గాంధీ గిరిజనబస్తీలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన పేద వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తున్నామని తెలిపారు. తెల్ల రంగు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు. అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## సాయిబాబా దేవాలయానికి చిలుక వితరణ


విరాళాన్ని అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 :** దేవాలయాలనిర్మాణం అభివృద్ధికోసం తన వంతు సహకారాన్ని అందిస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసాయినాథ్ దేవాలయ నిర్మాణానికి చిలుక ఉపేందర్‌రెడ్డి రూ.25వేలు శుక్రవారం దేవాలయం కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్‌రెడ్డి, రవీందర్‌సింగ్, నైనల విజయ్, కృష్ణారావు, రేవల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో అన్నప్రసాద పంపిణీ


అన్న ప్రసాదం అందజేస్తున్న కందికంటి కన్నా గౌడ్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** నాగోల్ గ్రామంలోని శ్రీమహంకాళి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకొని మొదటిసారిగా అమ్మవారిపూజ అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ప్రతి నెల అమావాస్య రోజు అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం చేపడతామని దేవాలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బద్దం మహేందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కందికంటి కన్నాగౌడ్, కోశాధికారి బద్దం నరేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రావుల రాజుగౌడ్, జాయింట్‌సెక్రెటరీ చెరుకు గణేష్‌గౌడ్, గోల్కొండ మైసయ్య, నాగోల్ సుధాకర్‌చారి, బద్దం ధనుంజయ్ గౌడ్, బద్దం వెంకటేష్‌గౌడ్, అనంతుల శ్రీనివాసరెడ్డి, బద్దం రామకృష్ణగౌడ్, జిలకపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌ఆజాద్, ఉమామహేశ్వర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లింగాల నర్సింగ్, మేకల సత్యనారాయణ, బద్దం శ్రీధర్‌గౌడ్, బద్దం కుమార్‌గౌడ్, జగదీష్, స్కికందర్, చెరుకు సంతోష్‌గౌడ్, బాబు, జగన్, కందికంటి వెంకటేష్‌గౌడ్, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యారంటీ పథకాలకు అర్హులను ఎంపిక చేయడానికి క్షేత్ర పరిశీలన: కమీషనర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతుందని కమీషనర్ వాణిరెడ్డి తెలిపారు. గ్యారంటీ పథకాల్లో భాగమైన మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రూ.500లకే వంట గ్యాస్ సిలెండర్ పథకం అమలు చేయడానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించే నిమిత్తం క్షేత్ర స్థాయి పరిశీలన ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరిశీలించడానికి వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు గ్యాస్ బుక్ తదితర వాటిని చూపించాలని కమీషనర్ సూచించారు.

## క్రీడా కార్మికులకు కార్మిక చట్టాలను అమలుచేయాలి : కీసరి నర్సిరెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనాకేంద్రం (క్రీడ)లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మికులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సి రెడ్డి డిమాండ్ చేశారు. క్రీడ ప్రధాన ద్వారం ముందు శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... క్రీడ కార్మికులకు 22 రోజుల పనిదినాలను అమలు చేస్తున్నారని... వారికి 26 పనిదినాలను కొనసాగించాలన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న కూలీలను దినసరి కూలీలుగానే గుర్తిస్తున్నారని వారికి పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులకు వేతనాలను పెంచాలని, ఉచిత కరెంటును అమలు చేయాలని, అటవి చట్టాలను సవరించి కఠినంగా అమలు చేయాలని, మైనింగ్ నిబంధనలను సవరించాలన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈనెల 16న నిర్వహించే సమ్మెలో క్రీడా కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్యారదర్శన్, రావుల రాజు, పి.యాదగిరి, లావణ్య, అలివేలు, దానయ్య, చలుకమ్మ, నాగయ్య, శ్రీరాములు, నాగమణి, ఆంజనేయులు, అశోక్ పాల్గొన్నారు.

## ఘనంగా కాల భైరవస్వామి కల్యాణోత్సవం


శ్రీ కాల భైరవస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల గీత, గంధం జ్యోష్ణ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని స్వయంభూ కాల భైరవస్వామికల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుష్యమాస అమావాస్యసందర్భంగా ఆలయకమిటి నేతలు ఎస్.వినోద్‌రెడ్డి, పి.ఉపేందర్, కె.శివయ్య, లక్ష్మణ్, బొట్టు వెంకట్, ఈగ సంతోష్, రాకేష్‌రెడ్డి, నరసింహారెడ్డి రమాకాంత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్, గంధం జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా అమావాస్య రోజున స్వయంభూ కాలభైరవుని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాల భైరవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన అకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాహారతి, మంత్ర పుష్పం, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలు


జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఉప్పల్ ఆర్య సమాజం నేతలు

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి ఉత్సవాలు ఈనెల 9వ తేది నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్య సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్ల విజయ్‌కుమార్, ఉప్పల్ ఆర్య సమాజం అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, సంస్థాపకులు అచార్య వేద సింధు, రాజ్య సంగర్షణ మంత్రి నందనం కృపాకర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వేద విజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని, వేదం చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని, జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చని తెలిపిన గొప్ప వ్యక్తి స్వామి దయానంద సరస్వతి అని కొనియాడారు. దేశ ఔనత్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని స్వామిజీ బోధించారని వివరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఆర్య సమాజం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేది నుంచి 12 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, వైదిక యజ్ఞ చికిత్స,యోగా ధ్యాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉప్పల్‌లోని జోషి విద్యానికేతన్‌లో వీటిని నిర్వహిస్తామని, వీటి నిర్వహణ కోసం ముంబై నుంచి ప్రశిక్షకులుగా స్వామి యజ్ఞదేవ్‌జీ మహరాజ్, హరిద్వార్ డా.కమల నారాయణ, రాయపూర్ బ్రహ్మాచారి అరుణ్‌కుమార్‌లు పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలకు త్రిదవాసియా యుద్ధ చికిత్స యోగా ధ్యాన ప్రశిక్షణ శిబిరంగా నామకరణంచేసినట్లు తెలిపారు. ఆదివారం హబ్సిగూడ హనుమాన్ ఆలయం నుంచి దయానంద సరస్వతి శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పాల్గొంటున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానం : అన్నదాన ట్రస్ట్ చైర్మన్ భగవాన్

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానమని శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్ట్ చైర్మన్ భగవాన్ అన్నారు. అమావాస్య సందర్భంగా భగవాన్ ఆధ్వర్యంలో చంపపేటలోని నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ ఆలయం వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలలుగా అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవిముదిరాజ్, సుశీల కుమార్, సంతోష్ లడ్డ, ప్రవీణ్, వెంకటేష్, చింటూ,రాజు , షాన్వాస్,అండేకార్ వెంకటేష్ , శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కు పరిసర ప్రాంతాలు శుభ్రపరచాలి : కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్


పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** పార్కు పరిసర ప్రాంతాలు శుభ్రపరిచే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ సూచించారు.సరూర్‌నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్ పార్కులో పచ్చదనం, అపరిశుభ్రత నిర్వహణ విషయంపై స్థానిక కాలనీవాసులు, వాకర్లు శుక్రవారం కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని హెచ్‌ఎండిఏ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ అనంతకుమార్‌తో కలిసి హుడా కాంప్లెక్స్ పార్కును కార్పొరేటర్ సందర్శించి పార్క్ సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పార్కు పరిసర ప్రాంతాలలో ఆహ్లాదకరమైన వాతావరణం వండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## వాకింగ్ ట్రాక్ పనులు పరిశీలన : అరుణ


వాకింగ్ ట్రాక్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్ రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎల్ సి హెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్ పార్కులో చేపట్టిన వాకింగ్ ట్రాక్ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని అన్ని పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ వెంకన్న, వర్క్ ఇన్స్‌పెక్టర్ రాజ్ కుమార్, కాలనీ అధ్యక్షుడు బ్రహ్మం, శీల, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు అండగా నిలుస్తాం : మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఆటో కార్మికులకు తమ అండగా నిలుస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని ఆటో కార్మికులకు మద్దతుగా వారికి నెలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ఆటోకార్మికుల కుటుంబాలు రోడ్డునపడకుండా చూసే బాధ్యత ప్రభుత్వానికి ఉందని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్ న్యూఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆటో కార్మికులకు మద్దతుగా నిరసన ప్రదర్శన చేపట్టారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీ వరకు ఆటోలో ప్రయాణించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐవిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాసగుప్త తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా, ట్రైకలర్స్ ఆసుపత్రి అంబర్‌పేట సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రామంతాపూర్ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, అధ్యక్షులు సంబు పాండయ్యగుప్త, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్‌గుప్త, కోశాధికారి బోనగిరి శ్రవణ్‌కుమార్‌గుప్త, అధ్యాత్మిక కమిటి చైర్మన్ భువనగిరి శ్రీనివాస్‌గుప్త, అడిషనల్ కోశాధికారి పూరే నగేష్‌గుప్త, మంజునాథగుప్త, మహిళ కార్యదర్శి సంబు జయమ్మ, బోనగిరి లావణ్య, నాగమణి, సాయి తులసి భవన్ గౌరవ చైర్మన్ చకిలం రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాసగుప్త మాట్లాడుతూ ఐవిఎఫ్ ఆధ్వర ్యంలో ప్రతి నెలా అమావాస్య సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

## నాచారం ప్రధాన రోడ్డుపై మురుగు వ్యర్థాలు పారవేసిన యజమానికి జరిమానా

**నాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నాచారం ప్రధాన రోడ్డుపై మురుగు వ్యర్థాలు పారవేసిన అపార్ట్‌మెంట్ యజమానికి కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్ఓ డా. వెంకటరమణ జరిమాన వేశారు. తన అపార్ట్‌మెంట్‌లో పేరుకు పోయిన డ్రైనేజీ,మురుగు వ్యర్థాలను సదరు ఇంటి యజమాని చౌదరి గురువారం రాత్రి నాచారం ప్రధాన రోడ్డుపై పారవేశాడు. దీంతో స్థానికులతో విషయం తెలుసుకున్న ఎంహెచ్ఓ స్పందించి శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగేలా రోడ్డుపై వ్యర్థాలను పారవేయడమేమిటని యజమానిని ప్రశ్నించి మరోసారి ఇలాంటి పనులు చేయవద్దని హెచ్చరించి జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్త, వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

## గడచిన పది సంవత్సరాల్లో మోడీ సాధించిన విజయాలపై ప్రజల్లో ప్రచారం: శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** గడచిన పది సంవత్సరాల ఎన్‌డిఎ పాలనలో ప్రధాని నరేంద్ర మోడి నాయకత్వంలో సాధించిన విజయాలను బిజెపి శ్రేణులు బస్తీలు, పల్లెల్లో వివరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 17వ డివిజన్ బూత్‌లలో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో శంకర్‌రెడ్డి పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ ్యంలో రాష్ట్ర బిజెపి ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక బస్తీల్లో పర్యటించి ప్రజలను కలిసి ఎంపి ఎన్నికల్లో ప్రధాని మోడీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్, రామిడి శేఖర్‌రెడ్డి, రాములు, లక్ష్మణ్, కృష్ణ, రవికుమార్, బాలరాజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** తొలి తెలుగు ప్రధాని పివి. నరసింహారావుకు భారతరత్నతో సత్కరించడం దేశానికి గర్వకారణమని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. పీవీకి భారతరత్నతో తెలంగాణ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. తెలుగు తేజం, బహుభాషా వేత్త, ఆర్థిక సంస్కరణల ఆవిష్కర్త అయిన పీవీకి భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజలు గర్వించదగ్గ విషయం అన్నారు. అదేవిధంగా హరిత విప్లవ పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్, మాజీ ప్రధాని చౌదరిచరణ్‌సింగ్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వికలాంగులకు రేషన్ బియ్యం ఇవ్వాలని వినతి

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ పౌరసరఫరాశాఖ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ లక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు ఎస్.వినయ్ మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగుల కుటుంబాలకు రావాల్సిన 35 కిలోల బియ్యం కోటా గత కొద్ది రోజులుగా ఇవ్వడం లేదన్నారు. గతంలో బియ్యం ఇచ్చే వారిని, దీనిపై ప్రజాదర్బార్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈ పథకాన్ని తిరిగి పునః ప్రారంభించాలని ఆయన కోరారు. దీనిపై అధికారులకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి మెంబర్లు ఆర్.కృష్ణ, వై.లక్ష్మి.టి.నాగలింగం, సుశీల్, కీర్తి, శోభ, శ్రీనివాస్,నాగయ్య, మల్లేష్, బాలాజీ,యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** అమావాస్య సందర్భంగా చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చంపాపేట ప్రధాన రహదారిలోని ఆర్యవైశ్య సంఘం భవనం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. దాతల సహకారంతో గత ఏడు మాసాలుగా అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తా, ఇదు కుల విజయనాథ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఊరే రవీందర్, నరసింహారావు, జూలూరు చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.